# సాక్షి మంచిర్యాల

సోమవారం ; 3 ; ఏప్రిల్ ; 2023




**నిదానంగా మైదానం పనులు**

నస్పూర్‌లోని సింగరేణి స్టేడియం నిర్మాణ పనులు ప్రారంభించి ఏడాదైనా పూర్తి కాలేదు. క్రీడాకారులు ఐదు కిలోమీటర్ల దూరంలోని ప్రగతి స్టేడియానికి వెళ్లి ప్రాక్టీస్ చేస్తున్నారు. 8లో▸



**కాలుష్య నివారణకు 'ఎఫ్‌జీడీ'**

కాలుష్యాన్ని నియంత్రిస్తూ... పర్యావరణహితంలో ముందజలో నిలుస్తూ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు దేశస్థాయిలో కీర్తి సంపాదిస్తోంది. 8లో▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 37.5 /25.4

ఆకాశంలో కొంతమేర మేఘాలు ఉంటాయి. ఉష్ణోగ్రతలు మరింత పెరుగుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది.




## న్యూస్‌రీల్

### ఘనంగా శ్రీరామ పట్టాభిషేకం



మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని శ్రీసీతారామ ఆలయంలో శ్రీరామ పట్టాభిషేకం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజ, హోమంలో జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఓదెలు, ఆలయ కమిటీ చైర్మన్, కేకే–5 గని మేనేజర్ కవిత భూశంకరయ్య ఆర్కే–7 గని ఏజెంట్ వెంకటేశ్వర్‌రెడ్డి దంపతులు, యూనియన్ల ప్రతి నిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

### తప్పుడు ఆరోపణలను తిప్పి కొట్టాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిన్నయ్య

నెన్నెల: బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ఆరోపణలను కార్యకర్తలు తిప్పి కొట్టాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. నెన్నెల మండలం ఆవుడం గ్రామంలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్‌ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసే బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. అందరూ ఐకమత్యంతో సమష్టిగా రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను మరోమారు గెలిపించాలని సూచించారు. సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీని అధికారంలోకి తెస్తాయని ధీమా వ్యక్తం చేశారు. గిరిజనులకు త్వరలోనే పోడు పట్టాలు ఇస్తామన్నారు. ఖాళీ స్థలం ఉండి ఇళ్లు నిర్మించుకునే వారికి రూ.3 లక్షలు అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ శ్యామల, పీఏసీఎస్ చైర్మన్ మేకల మల్లేశ్, ఆత్మ చైర్మన్ సున్నం రాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, సర్పంచ్ సత్తమ్మ, బీఆర్‌ఎస్ నాయకులు ఇబ్రహీం, పురంశెట్టి తిరుపతి, రాంచందర్, ప్రతాప్‌రెడ్డి, అశోక్‌గౌడ్, కొయ్యడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఆస్పత్రులపై చర్య తీసుకోవాలి

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో నిబంధనలు పాటించని ప్రైవేట్ అస్పత్రులపై చర్య తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అరిగెల మహేశ్ కోరారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రులను నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని ఆరోపించారు. చాలా ఆస్పత్రులు ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించడం లేదని పేర్కొన్నారు. అర్హతలేని నర్సులతో వైద్యం చేయిస్తున్నారని తెలిపారు. మెడికల్ షాపుల్లో బీఫార్మసి చేసిన వారే మందుల అమ్మకాలు చేయాల్సి ఉండగా, అర్హత లేనివారితోనే అమ్మకాలు చేయిస్తున్నారని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆస్పత్రిలో ఎమర్జెన్సీ ఫీజు రూ.500 నుంచి రూ.1000 వసూలు చేస్తున్నారని తెలిపారు. మల్టీ స్పెషాలిటీ అని బోర్డు పెట్టి ఒకరిద్దరు వైద్యులే అందుబాటులో ఉంటున్నారన్నారు. ఆస్పత్రి బోర్డుపై వైద్యుల పేర్లు ఉంటున్నాయి వైద్యులు ఉండడంలేదని పేర్కొన్నారు.

# గుడిపేటలో మెడికల్ కళాశాల?



గుడిపేట శివారులో మెడికల్ కళాశాల ప్రతిపాదిత స్థలాన్ని చదును చేస్తున్న దృశ్యాలు

- ప్రతిపాదిత స్థలాన్ని పర్యవేక్షించిన కలెక్టర్
- భూమి చదును పనులు ప్రారంభం
- త్వరలో శంకుస్థాపన చేసే అవకాశం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మెడికల్ కళాశాల జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న హాజీపూర్ మండలం గుడిపేటలో ఏర్పాటు కాబోతోందా అంటే అవుననే అంటున్నాయి అధికార వర్గాలు. 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ సమీపంలోని అటవీ శాఖ నర్సరీ సమీపంలో 294, 300 సర్వే నంబర్లలో దాదాపు 40 ఎకరాల స్థలాన్ని మెడికల్ కళాశాలకు కేటాయించినట్లు సమాచారం. ప్రతిపాదిత స్థలాన్ని కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదివారం పరిశీలించారు. దీంతో కళాశాల నిర్మాణం గుడిపేటలోనే అన్న ప్రచారానికి బలం చేకూరుతోంది.

**గతంలోనే ప్రతిపాదన..**

గుడిపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు గతంలోనే ప్రతిపాదనలు చేసినా జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ రావడంతో గుడిపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటు అంశంపై అధికారులు పునరాలోచనలో పడ్డారు. జిల్లా కేంద్రంలోని గోదావరిరోడ్‌లో ఉన్న భూదాన్ బోర్డ్ భూమిలో నిర్మించాలని ప్రతిపాదన చేశారు. అయితే ఆ స్థలం కళాశాల నిర్మాణానికి అనువుగా లేదని స్పష్టం తేలడంతో నస్పూర్, జైపూర్ మండలం ఇందారంలో ఏర్పాటుకు ప్రతిపాదనలు వచ్చాయి. అయితే జిల్లా కేంద్రానికి దూరంగా ఉంటాయని వాటిని తిరస్కరించారు. జిల్లా కేంద్రంలోనే ఏర్పాటు చేయాలని సాయికుంటలోని ప్రభుత్వ భూమిని ఖరారు చేశారు. ఆ ప్రాంతం కూడా కళాశాల ఏర్పాటుకు అనువుకాదని మెడికల్ బోర్డు స్పష్టం చేసింది. దీంతో 2021 జులైలో గుడిపేటలో ప్రతిపాదించిన స్థలంలోనే మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కలెక్టర్ సంతోష్ ఆదివారం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. కళాశాలకు వెళ్లే దారి చిన్నగా ఉంటుందన్న కారణంతో అధికారులు ఈ స్థలాన్ని మెడికల్ బోర్డుకు పంప లేదు. తాజాగా ఈ రోడ్డు నాలుగు వరుసలుగా విస్తరించే అవకాశం ఉండడంతో గుడిపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటు అంశం తెరపైకి వచ్చింది.



ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, ఆర్డీఓ వేణు(ఫైల్)

**అన్నివిధాలా అనువుగా..**

గుడిపేటలోని స్థలం మెడికల్ కళాశాల ఏర్పాటుకు అన్నివిధాలుగా అనువుగా ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. జిల్లా కేంద్రం నుంచి 10 నిమిషాల్లో కళాశాలకు చేరుకునే అవకాశం ఉంటుంది. ఈ క్రమంలో కలెక్టర్ హుటాహుటిన గుడిపేటలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు ప్రతిపాదించిన నర్సరీ ప్రాంతాన్ని పరిశీలించినట్లు తెలుస్తోంది. ఈ స్థలాన్ని రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో చదును కూడా చేయిస్తున్నారు. గతంలో ఈ స్థలం మెడికల్ కళాశాలకు అనువుగా ఉంటుందని నివేదిక కూడా ఇచ్చారు. నాలుగు రోజుల్లో మెడికల్ కళాశాల ఏర్పాటుపై అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం మంచిర్యాల కాలేజ్ రోడ్‌లోని వ్యవసాయ మార్కెట్ కమిటీలోని గోదాముల్లోని తాత్కాలిక భవనాల్లో మెడికల్ కాలేజీని కొనసాగిస్తున్నారు.

# విజయోస్తు..

- నేటి నుంచి 'పది' పరీక్షలు
- జిల్లాలో 55 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న విద్యార్థులు 10,125 మంది
- సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్ నం. 08736-252420



మంచిర్యాల బాలుర పాఠశాలలో పదోతరగతి విద్యార్థులు

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉదయం 9.30 గంటల నుంచి 12.30 వరకు పరీక్షలు జరుగనున్నాయి. ఈసారి ఆరు పేపర్లతో పరీక్ష నిర్వహిస్తున్నారు. కేంద్రాల్లో బెంచీలు, తాగునీరు, విద్యుత్, గాలి, వెలుతురు ఉండేలా మౌలిక వసతులను విద్యాశాఖ సమకూర్చింది. మాస్ కాపీయింగ్ జరుగకుండా అధికారులు, సిబ్బందికి జిల్లా విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష రాసే విద్యార్థులకు ఉపాధ్యాయులు పలు సూచనలు చేశారు. హాల్‌టికెట్లు అందించి ఆల్ ది బెస్ట్ చెప్పారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు గంట ముందు కేంద్రాలకు చేరుకోవాలని డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు.

**10,125 మంది విద్యార్థులు.. 55 కేంద్రాలు..**

జిల్లాలో 'పది' పరీక్షలకు 55 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో 41, ప్రైవేట్ పాఠశాలల్లో 14 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో మొత్తం 10,125 మంది రెగ్యులర్ విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో 172 మంది ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు ఉన్నారు. మొత్తం 5,550 బాలురు, 4,875 మంది బాలికలు పరీక్షకు హాజరుకానున్నారు.

**పరీక్షల నిర్వహణ ఇలా ...**

పరీక్షల నిర్వహణకు సీఎస్, డీవో, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు విధులు నిర్వహించనున్నాయి. చీఫ్ సూపరింటెండెట్లు 55, డిపార్ట్‌మెంట్ అధికారులు 55, ఇన్విజిలేటర్లు – 587లో సీ సెంటర్ కస్టోడియన్లు 04, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, 55 మంది సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు ఏర్పాటు చేశారు. 55 మంది ఏఎన్‌ఎంలు పరీక్ష కేంద్రాల్లో అందుబాటులో ఉంటారు. పరీక్షల విధులు కేటాయించిన సిబ్బంది సమయానికి ఆయా కేంద్రాలకు రావాలని నిబంధనల ప్రకారం ప్రశ్నపత్రాలను స్టోరేజ్ పాయింట్ల నుంచి తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతీ కేంద్రం వద్ద సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలకు వంద మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయనున్నారు.

**ఉచిత ప్రయాణం ఉత్తమాటే..**

పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం ఉత్తదే. బస్‌పాస్‌లు కల్గిన విద్యార్థులకు మాత్రమే ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించనున్నారు. బస్‌పాస్ ఉన్న విద్యార్థులకు మాత్రం హాల్ టికెట్ చూపిస్తే ఇదివరకు పరిమిత రూట్ కాకుండా పరీక్ష కేంద్రాల వరకు ప్రయాణించేందుకు అనుమతి ఇవ్వనున్నారు. జిల్లాలోని ఆయా మోడల్ స్కూల్‌లో చదివే విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులు నడుపనుంది. విద్యార్థులకు సంబంధించిన నగదును యాజమాన్యాలు చెల్లించడంతో స్కూల్ నుంచి పరీక్ష కేంద్రం వరకు విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది.

**విద్యార్థులు, తల్లిదండ్రులకు సూచనలు..**

విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆన్‌లైన్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్ ద్వారా పరీక్షలకు అనుమతించనున్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రం ఎక్కడుందో ముందే తెలుసుకుంటే మంచిది. పరీక్ష రాయటానికి రైటింగ్ ప్యాడ్లు తీసుకెళ్లాలి. హాల్‌టికెట్, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజర్లు, స్కేలు తప్పనిసరిగా తీసుకెళ్లేలా చూడాలి. క్యాలిక్యులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్స్ పరికరాలు తీసుకెళ్లరాదు.

**సందేహాల నివృత్తికి హెల్ప్‌లైన్..**

పదో తరగతి వార్షిక పరీక్షలు రాసే విద్యార్థుల కోసం హెల్ప్‌లైన్ ఏర్పాటు చేశారు. ఏదైనా సందేహాలు, సమాచారం కోసం 08736-252420, పరీక్షల విభాగం అధికారి – దామోదర్‌రావు నంబర్ 7032463114కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

**5 నిమిషాల వరకు...**

ఆత్మవిశ్వాసంతో, ధైర్యంగా పరీక్షలు రాయండి. పరీక్ష సమయానికి గంట ముందుగానే కేంద్రాలకు చేరుకుంటే మంచిది. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్ష కేంద్రంలోకి 9.35 తర్వాత అనుమతించరు. కాంపోజిట్ తెలుగు పరీక్ష రాసే విద్యార్థులకు అదనంగా 20 నిమిషాలు కేటాయించటం జరిగింది. సామాన్య శాస్త్రం పరీక్ష విషయంలో కూడా అదనంగా 20 నిమిషాలు కేటాయించాం. విద్యార్థులు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలి. – ఎస్.వెంకటేశ్వర్లు, డీఈవో

# అడవిలో ఆగని వేట



వేటగాళ్ల చంపి పాతిపెట్టిన పులి ఎముకలు(ఫైల్)

- అభయారణ్యంలో అంతరిస్తున్న వన్యప్రాణులు
- వేటగాళ్ల ఉచ్చులకు మూగ జీవాలు బలి
- 'మామూలు'గా తీసుకుంటున్న అటవీ శాఖ

మంచిర్యాలక్రైం: ప్రకృతి అందాలకు నిలయంగా ఉన్న కవ్వాల్ అభయారణ్యం. ఒక వైపు మహారాష్ట్ర తడోబా అభయారణ్యం కలుపుకుని ఉంది. వన్యప్రాణులు ప్రాణహిత నది దాటి జిల్లా అటవీ ప్రాంతంలోకి చేరుకుంటున్నాయి. అయితే అభయారణ్యంలో వన్యప్రాణుల వేట ఆగడం లేదు. వేటగాళ్ల ఉచ్చులు, బాణాలకు మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయి. దీంతో అభయారణ్యంలో వన్యప్రాణులు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఒకప్పు డు కుందేళ్లు, పులులు, జింకలు, చిరుతలు, దుప్పులు ఎలుగుబంట్లు, నీలుగాయిలు, అడవి దున్నలు ఎక్కుగా ఉండేవి. అభయారణ్యంతోపాటు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేస్తున్నా వేట మాత్రం ఆగడం లేదు. నెల క్రితం ఉట్నూర్‌కు చెందిన ఓ మాంసం వ్యాపారి ఆవు, ఎద్దు మాంసం పేరిట వన్యప్రాణి మాంసాన్ని లక్సెట్టిపేటకు తరలిస్తుండగా జిల్లా అటవీ శాఖ అధికారి పట్టుకున్నాడు. అయితే వ్యాపారి నుంచి డబ్బులు తీసుకుని వదిలేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లక్సెట్టిపేటకు చెందిన అధికార పార్టీ నాయకుడు అధికారికి, వ్యాపారికి మధ్యవర్తిత్వం వహించినట్టు సమాచారం.

**ఉచ్చులు, ఎయిర్ గన్స్‌తో వేట...**

వేసవి కాలంలో అటవీ ప్రాంతంలో చెట్ల ఆకులు రాలిపోవడంతోపాటు వాగులు, వంకల్లో నీరు అడుగంటుతుంది. దీంతో తాగునీటి కోసం వన్యప్రాణులు బయటకు వస్తుంటాయి. ఈ క్రమంలో వేటగాళ్లు జంతువులు వచ్చే ప్రాంతాలను గుర్తించి ఉచ్చులు, విద్యుత్ తీగలు అమరుస్తున్నారు. జిల్లాలో పలువురు ఎయిర్ గన్స్‌తో వన్యప్రాణులను వేటాడుతున్నట్లు సమాచారం. వేసవికాలంలో పదుల సంఖ్యలో కుందేళ్లు, జింకలు, నీల్‌గాయి, సాంబారు లాంటి వన్యప్రాణులను హతమారుస్తూ వాటి మాంసాన్ని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

**కిలో రూ.1000**

వన్యప్రాణుల మాంసాన్ని రహస్యంగా తరలిస్తూ విక్రయిస్తున్నారు. ముందుగా బుక్ చేసుకున్న వారికి కిలో రూ.1000 చొప్పున విక్రయిస్తున్నట్లు సమాచారం. జన్నారం, ఉట్నూర్, కోటపల్లి, నీల్వాయి, ర్యాలీగడ్‌పూర్, శివ్వారం అటవీ ప్రాంతంలో కొందరు వేటగాళ్లు జంతువులను హతమార్చడమే వృత్తిగా మార్చుకున్నారు. మాంసాన్ని మంచిర్యాల, లక్సెట్టిపేట ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. అటవీ జంతువులను హతమార్చిన కేసుల్లో పెద్దగా ఎవరికీ శిక్షలు పడిన దాఖలాలు లేవు. దీంతో వేటగాళ్లు మరింత రెచ్చిపోతున్నారు. అడవుల నుంచి వంట చెరుకు తెచ్చుకున్నా అనుమతించని అటవీశాఖ అధికారులు వేటగాళ్లు జంతువులను వేటాడుతున్నా పట్టించుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

**అధికారుల చర్యలు శూన్యం....**

అటవీ జంతువులను కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అడవుల సంరక్షణకు ప్రభుత్వం ఒక జిల్లా అధికారి, ఎఫ్‌డీవోలు, డీఆర్వోలు, ఎఫ్‌ఆర్వోలు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లతోపటు సిబ్బందిని నియమించింది. సంబంధిత అధికారులు అటవీ ప్రాంతంలో తిరుగుతున్నా వన్యప్రాణులను కాపాడలేకపోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అడవుల్లో వన్యప్రాణులకు తాగునీటి కోసం అధికారులు కాలువలు, కుంటలు నిర్మించినా పెద్దగా ఫలితం ఉండడం లేదు.

**నిఘా వైఫల్యం...**

జిల్లాలో వన్యప్రాణుల వేటపై అటవీ శాఖ అధికారుల నిఘా వైఫల్యం విమర్శలకు తావిస్తోంది. గత నెల 25న బెల్లంపల్లి అటవీ డివిజన్ కుషపెల్లి రేంజ్ పరిధిలో పులి కళేబరం బయట పడిన కేసులో ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ పులిని ఐదేళ్ల క్రితం హతమార్చి పూడ్చి పెట్టారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి రావడం అటవీ శాఖ అధికారుల నిఘా వైఫల్యాన్ని ఎత్తి చూపుతోంది. చనిపోయిన పులిని తరలించడం మనుషులతో కాకపోవడంతో ఎడ్లబండిని ఉపయోగించి పాతి పెట్టే ప్రాంతానికి తరలించారు. అంటే ఈ కేసులో ముగ్గురితోపాటు మరికొందరు కూడా ఉన్నట్లు సమాచారం. వన్యప్రాణుల వేట, వేటగాళ్ల నియంత్రణలో అటవీశాఖ అధికారుల వైఫల్యంపై డీఎఫ్‌వో శివ్ ఆశిష్ సింగ్‌ను వివరణ కోరేందుకు 'సాక్షి' ఫోన్‌లో ప్రయత్నించగా ఆయన స్పందించలేదు.



వేమనపెల్లి మాంసంతో పట్టుబడిన నిందితులు (ఫైల్)

**జిల్లాలో ఇటీవల జరిగిన కొన్ని ఘటనలు..**

- మందమర్రి మండలం పులి మడుగులో వన్యప్రాణులను(అలుగులు)వేటాడి విక్రయిస్తున్న ఓ ముఠాను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. ఈ ముఠాలో 20 మంది ఉన్నారు.
- జన్నారం అటవీ డివిజన్ పరిధిలో తాళ్లపేట్ రేంజ్‌లోని రాజుగూడ శివారులో ఓ సాంబారును వేటగాళ్లు హతమార్చిన ఘటన వెలుగులోకి వచ్చింది.
- కోటపల్లి మండలం రాపన్‌పల్లి పరిధిలో ఓ కొండ గొర్రె చర్మాన్ని అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

# 'గొల్లవాగు'పై చిన్నచూపు



బూర్గుపల్లిలో పాదయాత్రలో భట్టివిక్రమార్క, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ, నాయకులు

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- భీమారం మండలంలో పీపుల్స్ మార్చ్

భీమారం: భీమారం ప్రాంతంలోని బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి ప్రారంభించిన గొల్లవాగు ప్రాజెక్టును తెలంగాణ ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని సీఎల్పీ నేత భట్టివిక్రమార్క ఆరోపించారు. హాథ్ సే హాథ్ జోడోయాత్ర కొనసాగింపులో భాగంగా చేపట్టిన పీపుల్ మార్చ్ పాదయాత్ర ఆదివారం భీమారం మండలంలో కొనసాగింది. దాంపూర్‌లో ప్రారంభమైన యాత్ర భీమారం వరకు కొనసాగింది. మధ్యలో బూర్గుపల్లి, పోతన్‌పల్లి గ్రామాల ప్రజల వద్దకి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బూర్గుపల్లిలో మాట్లాడుతూ తెలంగాణ ప్రజలకు మేలు జరుగుతుందని సోనియాగాంధీ ప్రత్యేక రాష్ట్రాన్ని అందించారని తెలిపారు. అయితే కేసీఆర్ అధికారం చేపట్టిన తర్వాత ధనిక రాష్ట్రం దివాళా దిశగా ప్రయాణిస్తోందని పేర్కొన్నారు. కేసీఆర్ కుటుంబం మాత్రమే ఆర్థికంగా బాగుపడిందని, తెలంగాణ ప్రజలు మాత్రం అన్నివిధాలుగా నష్టపోతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిర్మించిన గొల్లవాగు ప్రాజెక్టు కాలువలు ఇప్పటికీ పూర్తి చేయలేదన్నారు. కాలువలు లేక నేటికీ పూర్తిస్థాయిలో సాగు నీరు అందడం లేదని తెలిపారు.

**కాళేశ్వరంతో చెన్నూర్‌కు అన్యాయం..**

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్ రద్దు చేసి కాళేశ్వరం నిర్మించడంతో చెన్నూరు ప్రాంతానికి అన్యాయం జరిగిందని భట్టి ఆరోపించారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో వేలాది ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని పేర్కొన్నారు. చెన్నూరు లిఫ్ట్ అంటూ చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రజలను మోసం చేస్తున్నాడని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇసుక మాఫియాను పోషిస్తోందని విమర్శించారు. ఉద్యోగాలు భర్తీ చేస్తామని నోటిఫికేషన్లు ఇచ్చి ప్రశ్నపత్రాలు అమ్ముకున్నారని ఆరోపించారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీపై మంత్రి కేటీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

**భూములు లాక్కున్నారు..**

తాము ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములను అటవీశాఖ అధికారులు లాక్కున్నారని పోతన్‌పల్లి గ్రామంలోని మహిళలు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. పోడు వ్యవసాయం చేసుకుంటున్న భూములను లాక్కొని తమను బజారున పడేశారని ధరావత్ లక్ష్మితోపాటు మరికొందరు తెలిపారు. బతిమిలాడినా కనికరించలేదని విలపించింది. భట్టి లక్ష్మికి ధైర్యం చెప్పారు. పోతన్‌పల్లిలో ఏ ఇంటికి వెళ్లినా అన్యాయం జరిగిందనే ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కన్నీళ్లు లేని ఇందిరమ్మ రాజ్యం తెస్తామన్నారు. అధికారంలోకి రాగానే ఫారెస్ట్ యాక్ట్ అమలు చేసి పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, నాయకులు రిక్కుల శ్రీనివాస్‌రెడ్డి, నూకల రమేశ్, గుడిమల్ల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.



ధరవాత్ లక్ష్మిని ఓదార్చుతున్న భట్టివిక్రమార్క

**'భట్టి' పాదయాత్రపై ఇంటలిజెన్స్ ఆరా**

భీమారం: మంచిర్యాల జిల్లాలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేస్తున్న పీపుల్స్ మార్చ్ పాదయాత్రపై ఆదివారం ఇంటలిజెన్స్ అధికారులు ఆరా తీశారు. పాదయాత్రలో పాల్గొన్న నాయకుల వివరాలు తెలుసుకున్నారు. ప్రజలు భట్టి విక్రమార్కతో ఏయే సమస్యలు చెబుతున్నారు అనేది పరిశీలించారు. పాదయాత్రలో పాల్గొన్నవారు స్థానికులా లేకా ఇతర ప్రాంతాల నుంచి వచ్చారా అనేది కూడా తెలుసుకున్నారు. బీఆర్‌ఎస్ నాయకులు ఎవరైనా పాల్గొంటున్నారా అని ఆరా తీశారు.

# క్రమబద్ధీకరణకు మరో చాన్స్

- జీవోలు 58, 59 కింద ప్రభుత్వ స్థలాలకు దరఖాస్తుల స్వీకరణ
- జీవో 76 కింద సింగరేణి ఆక్రమిత స్థలాలకు..
- నిబంధనలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలి
- కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: అక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించిందని కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. జీవోలు 58, 59 కింద అభ్యంతరం లేని ఆక్రమిత ప్రభుత్వ స్థలాల క్రమబద్ధీకరణకు గడువును ఈనెల 30 వరకు పొడగిస్తూ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు. క్రమబద్ధీకరణకు గతంలో 2014 జూన్ వరకు ఉన్న తేదీని ప్రస్తుత కటాఫ్ తేదీని 2020 జూన్ వరకు పొడిగించిందని పేర్కొన్నారు. దీని ప్రకారం అర్హత గల వారు మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. గతనెల 17 విడుదల చేసిన జీవో 29 ప్రకారం దరఖాస్తు చేసుకునేందుకు వీలుగా ప్రభుత్వ మీసేవ కేంద్రాల్లో జీవో 58, 59 పోర్టల్‌ను తిరిగి తెరిచిందని, 58, 59 ఉత్తర్వుల కింద గతంలో తిరస్కరణకు గురైన దరఖాస్తులను పరిశీలించడం జరుగుతుందని వివరించారు. ఆక్రమిత అసైన్డ్, అభ్యంతరం లేని ఇతర ప్రభుత్వ స్థలాలు, అర్బన్ సిలింగ్ భూములను నిబంధనల మేరకు హక్కులు బదలాయింపు కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. జీవో 58 ప్రకారం 125 చదరపు గజాలలోపు స్థలాలు ఉన్న పేదలకు ఉచితంగా, అంతకన్నా ఎక్కువ విస్తీర్ణమైతే మార్కెట్ ధరకు క్రమబద్ధీకరించడం జరుగుతుందని తెలిపారు. జీవో 76 కింద ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణకు తాజాగా దరఖాస్తులు స్వీకరించి అర్హులకు పట్టాలు అందజేయడం జరుగుతుందని పేర్కొన్నారు. గతంలో సరైన ఆధారాలు లేక దరఖాస్తు చేసుకోలేకపోయిన వారు, దరఖాస్తులు తిరస్కరణకు గురైన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం స్థలంలో నిర్మాణం చేసుకుని నివాసం ఉంటున్నట్లు ఆధారం చూపించాల్సి ఉంటుందన్నారు. ఇంటి పన్ను, ఇంటి నంబర్ రశీదులు, నల్లా పన్ను, విద్యుత్ బిల్లు లాంటివి ఆధారాల కింద దాఖలు చేయాలని, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డు లాంటివి దరఖాస్తుతోపాటు జత చేయాలని తెలిపారు. 125 గజాల కంటే ఎక్కువ స్థలం ఆక్రమించుకున్న వారికి జీవో 59 ప్రకారం మార్కెట్ ధర లెక్కించడం జరుగుతుందని పేర్కొన్నారు. 126 నుంచి 250 గజాల వరకు రిజిస్ట్రేషన్ ధరలో 50 శాతం చెల్లించాల్సి ఉంటుందని, 251 నుంచి 500 గజాలలోపు 75 శాతం, 500 గజాల దాటితే 100 శాతం రిజిస్ట్రేషన్ ధర చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. వాణిజ్య అవసరాల కోసం వినియోగించే స్థలం అయితే పరిమాణంతో నిమిత్తం లేకుండా రిజిస్ట్రేషన్ ధర చెల్లించి క్రమబద్ధీకరించుకోవాల్సి ఉంటుందని తెలిపారు.



కలెక్టర్ సంతోష్

**5న 'చలో ఢిల్లీ'**



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

నస్పూర్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 5న చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు కోరారు. ఆదివారం ఆయన శ్రీరాంపూర్‌లో చలో ఢిల్లీ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తోందని విమర్శించారు. చలో ఢిల్లీ కార్యక్రమంలో సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్‌కుమార్, సింగరేణి కాంట్రాక్ట్ కార్మిక సంఘం బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### మహిళ అదృశ్యం


బొర్కుట ప్రవంతి(ఫైల్)

దహెగాం: మండలంలోని పంబాపూర్ గ్రామానికి చెందిన బొర్కుట ప్రవంతి (30) అదృశ్యమైనట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గత నెల 31న ఇంట్లో నుంచి వెళ్లిన ప్రవంతి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ప్రవంతి భర్త మొహన్‌దాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### అందవెల్లిలో యువతి..

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని అందవెల్లి గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఆదివారం ఈజ్‌గాం ఎస్సై జగదీశ్ తెలిపారు. ఈనెల 1న అమ్మమ్మ ఇంటికి వెళ్లింది. దీంతో ఇంటికి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. యువతి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నామని తెలిపారు.

### నేటి నుంచి పది పరీక్షలు

ఉట్నూర్: పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 132 ఆశ్రమ పాఠశాలలున్నాయి. పదో తరగతి విద్యార్థులు 3,901 మంది ఉన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో 1776, ఆసిఫాబాద్‌లో 1250, మంచిర్యాలలో 460, నిర్మల్‌లో 415 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈ సందర్భంగా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకుడు దిలీప్‌కుమార్ మాట్లాడారు. వంద శాతం ఫలితాలు సాధించేలా ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేక బోధన తరగతులు నిర్వహించామన్నారు. ప్రతి గిరిజన విద్యార్థికి పరీక్ష ప్యాడ్, చేతి గడియారం, జామెట్రీ బాక్స్, పెన్నులు, లాంగ్ స్కేల్ అందించినట్లు తెలిపారు.

### ఐకే-ఓసీపీ హెచ్ఎంఎస్ పిట్‌కార్యదర్శిగా షేక్‌వలీ


షేక్‌వలీ

జైపూర్: మండలంలోని ఇందారం ఐకే-ఓసీపీ హెచ్ఎంఎస్ పిట్ కార్యదర్శిగా షేక్ వలిని నియమించినట్లుగా హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ ఆదివారం ప్రకటించారు. ఇందారం ఓపెన్ కాస్టులో ఈపీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న షేక్ వలి హెచ్ఎంఎస్ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నాడు. ఓపెన్‌కాస్టులో కార్మిక సమస్యలపై పూర్తి అవగాహన కలిగి ఉండడంతో ఈ బాధ్యతలను అప్పగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా షేక్‌వలి మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఫిట్ కార్యదర్శిగా ఎంపిక చేసిన బ్రాంచి ఉపాధ్యక్షుడు జీవన్ జోయల్, కార్యదర్శి తిప్పారపు సారయ్య, సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ అనిల్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

### సెల్‌ఫోన్ దొంగలు అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఖుడియార్ మొహళ్ల కాలనీకి చెందిన ఓ వ్యక్తి సెల్‌ఫోన్‌ను దొంగలించి బైక్‌పై పరారైన దొంగలను టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా రైల్వేగేట్ సమీపంలో నంబర్‌ప్లేట్ లేని బైక్‌ను ఆపి వారిని విచారించారు. సెల్‌ఫోన్ దొంగలించిన విషయాన్ని వారు ఒప్పుకున్నట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ తెలిపారు. నిందితుడు రోహిత్‌తోపాటు మరో మైనర్ బాలుడిని అరెస్టు చేయగా, మరొకరు పరారీలో ఉన్నట్లు వివరించారు.

# నిదానంగా మైదానం పనులు


అసంపూర్తిగా ఉన్న సింగరేణి మైదానం

- పూర్తి కాని సింగరేణి స్టేడియం
- ఇబ్బంది పడుతున్న క్రీడాకారులు, వాకర్స్


పూర్తి కాని వాకింగ్ ట్రాక్

శ్రీరాంపూర్: నస్పూర్‌లోని సింగరేణి స్టేడియం నిర్మాణ పనులు నిదానంగా సాగుతున్నాయి. ఈ పనులు మొదలు పెట్టి సంవత్సరం కావస్తున్నప్పటికీ పూర్తికాలేదు. శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఎస్సార్పీ ఓసీపీలో ముంపునకు గురైన తాళ్లపల్లి, సింగపూర్, రామరావుపేట గ్రామాల నిర్వాసితులకు నస్పూర్ న్యూ నాగార్జున కాలనీ ఆనుకొని సర్వే నంబర్ 72లో ఆర్‌అండ్ ఆర్ కాలనీ ఏర్పాటు చేశారు. ఈ కాలనీతోపాటు సింగరేణి కాలనీల ప్రజల, క్రీడాకారుల నిమిత్తం సంవత్సరం క్రితం కాలనీల దిగువభాగంలో స్టేడియం ఏర్పాటు చేయడానికి కంపెనీ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటికీ నెలలు గడుస్తున్నా ఈ స్టేడియం పూర్తి కాలేదు. సుమారు 9ఎకరాల విస్తీర్ణంలో దీనిని సిద్ధం చేస్తున్నారు. చుట్టు కొంత భాగం ప్రహరీ, మరికొంత భాగం మెస్ వేసి బార్డర్ నిర్మించారు. మధ్యలో చాలా లోతట్టు ఉండడంతో దానిలో మట్టిపోసి చదును చేస్తున్నారు. ఇప్పటికీ సుమారు 10వేల క్యూబిక్ మీటర్ల మట్టిని పోశారు. అయినా ఇంకా చదును కాలేదు. పోసింది కూడా ఓసీపీ మట్టి కావడంతో అది తెల్లని దుమ్ముగా మారి క్రీడాకారులకు ఇబ్బందిగా ఉందని ఫిర్యాదులు రావడంతో అధికారులు దానిపై మళ్లీ ఎర్రమట్టి పోసి చదును చేయాలని నిర్ణయించారు. చుట్టూ వేసిన వాకింగ్ ట్రాక్ పూర్తిస్థాయిలో కాలేదు. పిల్లలు ఆడుకోవడానికి మైదానంలో ఓవైపు జారుడు బండ, ఉయ్యాలు, రౌండ్‌వీల్ ఏర్పాటు చేశారు. వీటి చుట్టు ఇసుక పోసి పిల్లలు ఆడుకోవడానికి అవునుగా తయారు చేయాలి. తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు కట్టించాలనిస్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రగతి స్టేడియంకు వెళ్లి ప్రాక్టీస్..**

ఇటీవల పోలీసు, ఇతర శారీరక దారుఢ్యక పరీక్షలు ఉండే ఉద్యోగాల కోసం పోటీపడుతున్న యువకులు చాలా మంది ఈ స్టేడియం అందుబాటులో లేక 5కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రగతి స్టేడియంకు వెళ్లి ప్రాక్టీస్ చేసి వచ్చేవారు. వారి ఈవెంట్స్‌కు ముందే ఈ మైదానం పూర్తి అవుతుందని భావించిన ఈవెంట్స్ పూర్తి అయిన స్టేడియం పూర్తి కాలేదు. శ్రీరాంపూర్ డివిజన్‌లోని 3వేల కుటుంబాలు ఉండే నస్పూర్ కాలనీ, షిర్కే కాలనీ, నాగార్జున కాలనీ, గోదావరి కాలనీలతో పాటు ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వాసులకు ఇప్పటికి ఇక్కడ మైదానం లేదు. ఈ మైదానం కోసం చాలా ఏళ్లుగా ఎదురుచూస్తున్నప్పటికీ పనులు సకాలంలో పూర్తి కాక క్రీడాకారులు, వాకర్లు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

**వాకింగ్‌కు ఇబ్బంది పడుతున్నాం**



ఇంతపెద్ద కాలనీలో స్టేడియం లేకపోవడం వల్ల వాకింగ్ చేయడానికి ఇబ్బంది పడుతున్నాం. చేసేది లేక ఉదయం కాలనీలోని రో డ్లపై నడుస్తున్నాం. నెలల తరబడి స్టేడియం పనులు చేస్తున్నారు. త్వరగా పనులు పూర్తి చేయాలి.

– ఎం. కృష్ణారావు, వాకర్

**మే నెలాఖరుకు పూర్తి చేస్తాం**

మైదానం పూర్తి కావడానికి ఇంకా కొన్ని చేయాల్సిన పనులు మిగిలి ఉన్నాయి. లోలైన్ ఏరియాలో మరింత మట్టిపోయాలి. మే చివరి నాటికి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెస్తాం.

– శివరావు, డీజీఎం(సివిల్), శ్రీరాంపూర్

# దుర్గం రాజేశ్‌ను సన్మానించిన ఎమ్మెల్యే


రాజేష్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్, బాబుజగ్జీవన్‌రామ్‌ల జయంతిని రాష్ట్ర కమిటీ వైస్ చైర్మన్‌గా నియామకమైన మంచిర్యాలకు చెందిన తెలంగాణ నేతకాని మహార్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్‌ను ఆదివారం బెల్లంపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నేతకానీ వర్గీయులతో కలిసి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్, బాబుజగ్జీన్‌రామ్‌ల జయంతి నిర్వహించే రాష్ట్ర కమిటీలో రాజేశ్‌కు చోటు కల్పించడంతో తెలంగాణ రాష్ట్రంలో నేతకాని కులాన్ని మరోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తించినట్లైందన్నారు. రాష్ట్ర కమిటీలో ప్రాతినిధ్యం కల్పించడానికి తోడ్పడిన రాష్ట్ర మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, నేతకాని, మహార్‌సంఘం నాయకులు నర్సయ్య, రాజం, గోపాల్, గోళ్ల రాజమల్లు, సునార్కార్ రాంబాబు, భీమయ్య, ప్రకాష్, బాను ప్రసాద్, శ్రీనివాస్, రాంచందర్, విశ్వనాథ్, గొర్లపల్లి విజయ్, గొర్లపల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

### చెరువులో దూకి డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

లోకేశ్వరం: చెరువులో దూకి డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పుస్పూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ కథనం ప్రకారం.. పుస్పూర్‌కు చెందిన దీపిక (17) భైంసా పట్టణంలోని ఓ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతోంది. విద్యార్థిని తాత పెద్ద ముత్తన్న వీఆర్ఏ గతనెల 20న గుండెపోటుతో మృతిచెందాడు. తాత చనిపోవడంతో దీపిక మానసికంగా కుంగిపోయి బాధపడుతుండేది. ఆదివారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకునేందుకు బయటకు వెళ్లింది. ఎంత సేపటికి రాకపోవడంతో అనుమానంతో కుటుంబీకులు వెతికారు. గ్రామ శివారులోని బోప్పాజీ చెరువులో దీపిక మృతదేహం లభించింది. తండ్రి చిన్న ముత్తన్న ఫిర్యాదుతో మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# నెరవేరనున్న వంద పడకల ఆస్పత్రి కల

- ఇటీవల శంకుస్థాపన చేసిన మంత్రి
- నిర్మాణ పనులు సొంతం చేసుకున్న క్రిషి నిర్మాణ సంస్థ
- త్వరలోనే ప్రారంభం కానున్న పనులు



చెన్నూర్‌లో నిర్మించే ఆస్పత్రి నమూనా

చెన్నూర్: చెన్నూర్ ప్రాంత ప్రజల కల నెరవేరనుంది. 50పడకల ఆస్పత్రి నిర్మాణం పూర్తి చేసుకుని మరో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి ముహూర్తం ఖరారుచేసుకుంది. గత నెల 15న ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆస్పత్రి నిర్మాణానికి భూమి పూజ చేసిన విషయం తెలిసిందే. నిర్మాణ పనులను క్రిషి కన్‌స్ట్రక్చర్స్ సొంతం చేసుకుంది. త్వరలోనే నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. వంద పడకల అసుపత్రి నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతంలోని అన్ని రకాల రోగులకు మెరుగైన వైద్య సేవలందనున్నాయి.

**అధునిక హంగులతో...**

చెన్నూర్ నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ఇప్పటికే రూ.7కోట్ల నిధులతో 50 పడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టారు. భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని చెన్నూర్ కేంద్రంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి విప్ మరో రూ.37.07 కోట్ల నిధులు మంజూరు చేయించారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి పాలనపరమైన అనుమతులు సైతం లభించాయి. దీంతో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు పనులకు భూమిపూజ చేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వ విప్ వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి కృషి చేశారు.

**మాతాశిశు కేంద్రంగా ప్రతిపాదన..**

చెన్నూర్ పట్టణంలో ప్రస్తుతం నిర్మిస్తున్న 50 పడకల ఆస్పత్రిని మాతాశిశు కేంద్రంగా మార్చాలని ఇటీవల చెన్నూర్ పర్యటనకు వచ్చిన ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావుకు ప్రభుత్వ విప్ బాల్క సుమన్ విన్నవించారు. 50 పకడల ఆస్పత్రిని మాతాశిశు కేంద్రంగా మార్చినట్లెతై మహిళలతో పాటు శిశువులకు సైతం మెరుగైన వైద్యం అందనుంది. గర్భిణులతో పాటు పిల్లలకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా ఈ ప్రాంత తల్లులు మంచిర్యాలతో పాటు కరీంనగర్ పట్టణాలకు తరలివెళ్తున్నారు. దీంతో నిరుపేదలకు దూరంభారంతో పాటు ఆర్థిక భారం పడుతోంది. చెన్నూర్‌లోనే మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేస్తే ఎంతో మేలు జరగనుంది.

**భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని...**



చెన్నూర్ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకు 50 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం చేపట్టాం. పెరుగుతున్న జనాభాతో పాటు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి కేసీఆర్ కృషితో వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి పూనుకున్నాం. ఈ ఆస్పత్రిని ఆధునిక హంగులతో నిర్మిస్తాం. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం.

–బాల్క సుమన్, ప్రభుత్వ విప్, చెన్నూర్

# కాలుష్య నివారణకు 'ఎఫ్‌జీడీ'


థర్మల్ పవర్ ప్లాంటులో అదనంగా నిర్మిస్తున్న రెండు చిమ్నీలు(ఎఫ్‌జీడీ నిర్మాణం)

- పర్యావరణహితంగా పవర్ ప్లాంటులో ఏర్పాటు
- రాష్ట్రంలోనే తొలి యూనిట్
- ముమ్మరంగా ఎస్టీపీపీలో నిర్మాణ పనులు
- వాయుకాలుష్య నివారణకు తోడ్పాటు
- రూ.700కోట్ల వ్యయంతో..
- అదనంగా మరో రెండు చిమ్నీలు

జైపూర్: కాలుష్యాన్ని నియంత్రిస్తూ... పర్యావరణహితంలో ముందజలో నిలుస్తూ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు దేశస్థాయిలో కీర్తి సంపాదిస్తోంది. మరో దశలో వాయి కాలుష్యాన్ని పూర్తిగా నివారించేందుకు చేపట్టిన ఎఫ్‌జీడీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. కేంద్ర పర్యావరణ శాఖ ఆదేశాలతో సుమారు రూ.700కోట్లతో పర్యావరనాన్ని పరిరక్షించేందుకు రాష్ట్రంలోనే తొలి యూనిట్‌గా ఎఫ్‌జీడీ (ఫ్లూగ్యాస్ డీసల్ఫరైజేషన్) నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. జైపూర్ మండల కేంద్రంలోని 1200మెగా వాట్ల సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు ద్వారా నిరంతరం విద్యుత్ ఉత్పత్తి చేస్తూ తెలంగాణ రాష్ట్రానికి విద్యుత్ కాంతులు పంచుతోన్న విషయం తెలిసిందే. థర్మల్ విద్యుత్ కేంద్రం అంటే బొగ్గును మండించి నీరును ఆవిరిగా మార్చే ప్రక్రియలో టర్బైన్ తిప్పడంతో విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. అయితే బొగ్గును మండించే క్రమంలో పొగలో సల్ఫర్, కార్బన్, లెడ్‌తో పాటు మరిన్ని విషవాయువులు వెలువడుతాయి. వెలువడే విషవాయువులతో చుట్టూ ఉండే పర్యావరనాన్ని కలుషితం చేయడంతో పాటు పరిసర ప్రాంతాల వాసులకు హానీ చేకూర్చే ప్రమాదం ఉంది. దీని మూలంగా సమీపంగా ఉండే ప్రజలు వ్యాధులు, రోగాల బారిన పడే అవకాశం నెలకొంది. వాతావరణం కలుషితమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉండే ప్రమాదం లేకపోలేదు. ఎఫ్‌జీడీల నిర్మాణానికి ముందు సల్ఫర్ ఆక్సైడ్ వాయువు ఘనపు మీటరుకు 2000 మిల్లీ గ్రాములు ఉంటే ఎఫ్‌జీడీ నిర్మించిన తర్వాత అందులో విష వాయుల శాతం 200మిల్లీ గ్రాములకు తగ్గనుంది. ఎఫ్‌జీడీ నిర్మాణంతో వాతావరణంలో వాయు కాలుష్యం దాదాపు తగ్గిపోయే అవకాశం ఉండడంతో పాటు ఇక్కడి ప్రాంత ప్రజల ఆరోగ్యంపై ప్రభావం తగ్గే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

**అదనంగా మరో రెండు చిమ్నీలు....**

ఎస్టీపీపీలో యూనిట్-1, యూనిట్-2 రెండు బాయిలర్లను అనుసందానం చేస్తూ మొదట 285 మీటర్ల ఎత్తులో ఒక్క చిమ్నీ నిర్మించగా దీనికి సమీపంలో 600మెగా వాట్ల ప్లాంట్లు రెండు ఉండగా వాటికి ప్రత్యేకంగా 150 మీటర్ల ఎత్తుతో మరో రెండు చిమ్నీల నిర్మాణాన్ని వేరువేరుగా నిర్మిస్తున్నారు. వీటి ద్వారా విషవాయుల ప్రభావాన్ని తగ్గించి కాలుష్యాన్ని పూర్తిగా నియంత్రించనున్నారు. ఇంతకు ముందు ఉన్న ఒక్క చిమ్నీకి అదనంగా మరో రెండు చిమ్నీల నిర్మిస్తుండటంతో పవర్ ప్లాంటు చూడటానికి మరో కొత్త రూపంగా కనిపిస్తోంది. మొదటి చిమ్నీని దాదాపు పూర్తి కావస్తుండగా రెండు కూడా సగానిపైగా పూర్తయ్యాయి. ఈ ఏడాది చివరికల్లా వీటి నిర్మాణాలు పూర్తి చేయాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. కాగా వీటికి అనుసందానంగా నిర్మిస్తున్న ఇటర్ కనెక్టింగ్, ఫౌండేషన్, అబ్జర్వర్, ట్యాంకులు, బూస్టర్ ఫ్యాన్, ఫ్యూయల్ ప్యాబ్రికేషన్ పనులు దాదాపు పూర్తికావచ్చాయి.

# మహనీయులను స్మరించుకోవాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్
- సర్ధార్ సర్వాయి పాపన్నకు నివాళి


మాట్లాడుతున్న వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్

పాతమంచిర్యాల: మహనీయులను స్మరించుకోవడం మన సంప్రదాయమని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. కలెక్టరేట్‌లో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సర్ధార్ సర్వాయి పాపన్నగౌడ్ 314వ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. సర్వాయి పాపన్నగౌడ్ చిత్ర పటానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సర్వాయి పాపన్న గొప్ప పోరాట యోధుడన్నారు. చిన్న కుటుంబంలో పుట్టి దేశం గర్వించదగ్గ వ్యక్తిగా పేరు ప్రతిష్టలు సంపాదించుకున్నాడని తెలిపారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేశాడన్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్ మాట్లాడుతూ సర్ధార్ సర్వాయి పాపన్న జీవిత చరిత్ర, ఆయన చేసిన పోరాటాలను పాఠ్యాంశాలుగా చేర్చాలని కోరారు. జిల్లా కేంద్రంలో సర్వాయి పాపన్న విగ్రహం ఏర్పాటు చేయాలన్నారు. 60 ఏళ్లు నిండిన గీత కార్మికులకు పింఛన్, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి వినోద్‌కుమార్ తెలంగాణ బీసీ జాగృతి అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు వైద్య భాస్కర్, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**మోకు దెబ్బ ఆధ్వర్యంలో..**

జిల్లా మోకు దెబ్బ, గౌడ సంక్షేమ సంఘం నాయకులు జిల్లా కేంద్రంలో సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతి నిర్వహించారు. పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా మోకుదెబ్బ, గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దూలం శ్రీనివాస్, మహేందర్‌గౌడ్, నరేశ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య

సారంగపూర్: జీవితంపై విరక్తితో వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలంలోని గోపాల్‌పేట్ గ్రామానికి చెందిన సీరె అశోక్ (60) గత కొన్నేళ్ల క్రితం భార్య, కుమార్తెతో విడిపోయి ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో తన ఆరోగ్యం దెబ్బతినడంతో తనను ఆదరించేవారు లేక మరింత అనారోగ్యానికి గురయ్యాడు. సక్రమంగా భోజనం చేసేవాడు కాదు. ఆరోగ్యం సహకరించకపోవడం, అన్ని పనులు చేసుకోలేక తీవ్ర మనస్తాపం చెందాడు. ఆదివారం తన ఇంటి ముందు పందిరిగుంజకు ఉరేసుకుని అశోక్ ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు, మృతుడి చెల్లె ఎర్రాడ్ల లక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్యతోపాటు 16 ఏళ్ల కుమార్తె ఉన్నారు.

### ఇంటికో ఉద్యోగం ఏమైంది

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రఘునాథ్‌రావ్

మంచిర్యాలక్రైం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఇంటికో ఉద్యోగం ఇస్తానని మన ఉద్యోగాలు మనకే, మన నీళ్లు మనకే అంటు బాడాయిలు కొట్టిన కేసీఆర్ ఇంటికో ఉద్యోగం ఏమైందో చెప్పాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌రావు డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యలయంలో ఆదివారం పలువురు బీజేపీలో చేరారు. మంచిర్యాల 32వ వార్డుకు చెందిన వివిధ పార్టీలక చెందిన 50 మంది బీజేపీలో చేరారు. వారికి రఘునాథ్‌రావు కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడు తూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దించడమే లక్ష్యంగా సైనికుల్లా పనిచేయాలన్నారు. కష్టపడి పని చేసిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందన్నారు. టీఎస్‌పీఎస్సీ ప్రశ్న పత్రాలు అమ్ముకుని నిరుద్యోగుల జీవి తాలతో కేసీఆర్ కుటుంబం చెలగాటం ఆడుతోంద ని ఆరోపించారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ ఇచ్చిన హామీలన్నీ నీటిమూటలయ్యాయని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి వస్తే అన్నివర్గాల ప్రజలకు సముచిత న్యాయం జరుగుతుందని తెలి పారు. కార్యక్రమంలో రజనీ ష్రైన్, ఆకుల అశోక్ వర్ధన్, ఆవిడపు రాజబాబు, దేవులపల్లి లక్ష్మీ నారా యణ, బోయిని హరికృష్ణ, గాజుల ప్రభాకర్, రాజమౌళి తదతరులు పాల్గొన్నారు.

# జై బోలో హనుమాన్ కీ

- ఘనంగా విజయయాత్ర
- హనుమాన్ నామస్మరణతో మార్మోగిన వీధులు


భక్తులతో కలిసి నృత్యం చేస్తున్న రాష్ట్రమంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: రామలక్ష్మణ ×జానక్షీ జై బోలో ×హనుమాన్‌కి అంటూ జిల్లా కేంద్రం హనుమాన్ నామస్మరణంతో మార్మోగింది. హనుమాన్ జయంతిని పురస్కరించుకొని బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం వీర హనుమాన్ విజయయాత్ర పట్టణ పురవీధుల గుండా ధ్యగావాడ, బాగులవాడ, బస్టాండ్ లైన్, బుధవార్‌పేట్, గాంధీచౌక్ మీదుగా కొనసాగింది. భక్తులు తమ ఇళ్లపై నుంచి హనుమాన్ విగ్రహంపై పూల వర్షం కురిపించారు. కాషాయ జెండాలతో జైశ్రీరామ్, జై హనుమాన్ అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ తీశారు. ఇందులో ముంబైకి చెందిన డోలషా బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యువత, స్వాములు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. సుమారు రెండువేల మంది హిందువులు యాత్రలో పాల్గొన్నారు. అంతకుముందు స్థానిక దేవరకోట దేవస్థానం వద్ద రాష్ట్రమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్ హనుమాన్ విగ్రహానికి పూజలు చేసి, జెండా ఊపి విజయ యాత్రను ప్రారంభించారు. మంత్రి నృత్యం చేసి, బ్యాండ్ కొట్టి అందరిని అలరించారు. నిర్మల్ డీఎస్పీ జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ దగ్గరుండి ర్యాలీని పర్యవేక్షించారు. ప్రార్థన స్థలాల వద్ద భారీ సంఖ్యలో పోలీసులు మోహరించారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, దేవరకోట ఆలయ చైర్మన్ లింగంపల్లి లక్ష్మీనారాయణ, కౌన్సిలర్ అయ్యన్నగారి రాజేందర్, బీజేపీ నాయకుడు అప్పల గణేశ్‌చక్రవర్తి, వక్తలు జిన్నా సత్యనారాయణ, డాక్టర్ ప్రమోద్ చంద్రారెడ్డి, శ్రీనివాస్, రఘునందన్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, బజరంగ్ దళ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**మంచినీటి పంపిణీ**

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో వీర హనుమాన్ విజయయాత్ర సందర్భంగా శ్రీధర్మశాస్త్ర యూత్ సభ్యులు భక్తులకు ఉచిత మంచినీటి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్‌కు నీటిని అందించారు. యూత్ సభ్యులు పులివేలి మణికంత, బాశెట్టి సాయికృష్ణ, చింతపందు రమేష్, తూర్పు రమేశ్ ఉన్నారు.